


# చచ్చి బ్రతికిన నిజాయితీ

సూరేపల్లి విజయ

కథ

**సేతు మాధవన్‌కు నిద్రపట్టడంలేదు. ముప్పయ్యేళ్ళుగా అతను అర్థరాత్రి దాటిన తర్వాతే నిద్రపోతున్నాడు.**

రాత్రానాను అతనికి కంటిమీద కునుకు అపురూపమైపోతోంది. ముప్పయ్యేళ్ళుగా అతను అభద్రతా భావంతోనే బ్రతుకుతూ వున్నాడు.

అప్పుడప్పుడు అతని మనసు సంఘర్షణతో కొట్టుమిట్టాడుతుంది. కారణం అతనికి కూడా తెలుసు. తను అవినీతిపరుడు... తనకు లంచాలు స్వీకరించడం ఓ యిష్టమైన విషయం. అయితే రాత్రానాను అది తనకు యిష్టమైన విషయంకాదు అని అనిపించసాగింది.

మొదట్లో అది తనకు అవసరం అనుకున్నాడు.

** ** **

**ము**ప్పయ్యేళ్ళ క్రితం ఓ మామూలు గుమస్తా అతను. చాలా తక్కువ జీతం. చాలా పెద్ద కుటుంబం. పై రాబడి లేదు. 'లేదు' అని అనడం కన్న 'రాదు' అని అనో, తను తీసుకోలేడు అనో అనుకుంటే సరిపోతుంది. అతనికి లౌక్యం తెలియదు.

ఈ ప్రపంచంలో వృత్తిపరమైన తెలివితేటలు వున్నవాళ్ళు... బ్రతికే తెలివితేటలు వున్నవాళ్ళు అనే రెండు కేటగిరీలువుంటాయని అతని థియరీ. వృత్తిపరమైన తెలివితేటలు వున్నవాళ్ళు ఆర్థికంగా రాణించలేరు.

మహా అయితే, మంచి నైపుణ్యం వున్న వ్యక్తి అని అనిపించుకోగలడు.అదే బ్రతికే తెలివితేటలు వున్న వాడు వృత్తిపరమైన నైపుణ్యం లేకున్నా దర్జాగా బ్రతగ్గలడు.

అప్పుడే... అక్కడే అతనిలో లౌక్యం తెలిసిన మరో మనిషి అనుకోకుండా బయటకు వచ్చాడు. తనకన్నా చాలా చిన్న వుద్యోగి ప్యూన్‌గా పనిచేసే వ్యక్తి టెర్లిన్, టెరికాటన్‌లాంటి బట్టలు వేసుకొని వస్తుంటే, తను చౌకరకం బట్టలు వేసుకుంటున్నాడు. పైగా తన భార్య అస్తమానం ఆ ప్యూన్‌తో తనని పోలుస్తూ వుంటుంది.

అలాంటి ఒకానొక పరిస్థితిలోనే, అనుకోకుండా ఫైలును కదల్చడానికి తనకు వంద రూపాయల లంచం ముట్టింది. యాభై రూపాయలు నెల మొత్తంలో అదనంగా లభిస్తున్నాయంటేనే, ఆనందంతో ఉప్పొంగే సేతు మాధవన్‌కు ఒకే ఒక్కసారి చిన్న ఫైలు కదలికకు అంత పెద్ద మొత్తం ముట్టడం సంతోషాన్నే కలిగించింది.

ఆ డబ్బుతో స్వీట్స్, భార్యకు పూలు, చిన్నాడికి బొమ్మలు తీసుకు వెళ్ళాడు. యింకా చిల్లర మిగిలింది. తనకు రెండు పెట్టెల సిగరెట్లు వచ్చాయి.

మొదటిసారిగా ఆ వంద రూపాయలు లంచంగా అందుకున్నప్పుడు అతని చేతులు వణికాయి. అతని మనస్సాక్షి సిగ్గుతో చితికిపోయింది.

ఆ రోజంతా అతను అసహనంగానే వున్నాడు.

ఆ విషయం హెడ్ గుమాస్తాకు తెలిస్తే...? అతనికి భయంలాంటిది కలిగింది. తప్పు ముందే ఒప్పుకోవాలని నిర్ణయించుకొని, హెడ్డు దగ్గరికి వెళ్ళి చెప్పాడు. అతను పగలబడి నవ్వి 'నావాటా నాకు ముట్టింది లేవయ్యా' అన్నాడు.

ఆ వాటాల ప్రస్థానం ప్యూన్ నుండి మొదలవుతుందని ఆ తర్వాత తెలిసింది. ఆ రోజంతా బాధ. తను లంచగొండా? తను అవినీతిపరుడా? తన బాధంతా ఎవరితో చెప్పుకోవాలి? తను క్రిస్టియన్ అయితే కన్‌ఫెషన్ బాక్స్ ముందు నిలబడి తన తప్పు చెప్పుకునేవాడు... కాకపోతేనేం?

ఆ రోజు కనీసం తన భార్యకైనా తను అవినీతి పరుడ్ని అన్న విషయం చెప్పాలన్న నిర్ణయానికి వచ్చాడు. అందుకే రాత్రి... చాలా పొద్దుపోయేక, భార్య దగ్గరికి వచ్చాడు.

"పరిమళా... నీకో విషయం చెప్పాలి నేను"

"చెప్పండి... ఈరోజు మళ్ళీ ఏమైనా డబ్బు అదనంగా వచ్చిందా?" అడిగింది ఆత్రంగా.

"అదికాదు పరిమళా... నేను తప్పుచేసాను. చాలా పెద్ద తప్పుచేసాను. అవినీతికి అలవాటు పడుతున్నానేమోనని భయం వేస్తోంది. తప్పు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడంలేదు. పై ఆఫీసర్‌కు చెప్పాలన్నా ధైర్యం చాలడంలేదు."

భార్యకు తన మనోవేదన చెప్పుకుపోతూనే వున్నాడు సేతుమాధవన్. కానీ, అప్పటికే ఆవిడ నిద్రపోతోంది. భర్త నుంచి పరివర్తన, పశ్చాత్తాపం అన్న మాటలు వినగానే ఆమెకు నిద్ర ముంచుకువచ్చినట్టుంది.

తను మొత్తం చెప్పి, భార్య రియాక్షన్ కోసం చూసాడు. ఆమె నిద్రపోతూ కనిపించేసరికి ఓ నిట్టూర్పు విడిచాడు.

** ** **

మరునటిరోజు ఆఫీసులో మరో ఫైలు అడ్డదారిలో కదిలించాల్సి వచ్చింది. ప్యూన్, హెడ్డు ముందే చెప్పారు. నూటయాభై రూపాయల లాంఛనం అనబడే 'లంచం' ముడుతుందని... ముందుగా అతనికి మనస్కరించలేదు. ఆ తర్వాత అయిదు రూపాయల కాగితాలు ముప్పయ్...ఒకేసారి చూసాక... 'ఈ ఒక్కసారికే' అని తన మనసుకు సర్ది చెప్పుకున్నాడు సేతుమాధవన్.

ఆరోజు అతను కొద్దిగా లిక్కర్ తీసుకున్నాడు తన బాధను లేదా తప్పును మరిచిపోవడానికి. అర్థరాత్రి దాటాక భార్య గదిలోకి వచ్చి తను చేసిన తప్పు చెప్పి బావురుమన్నాడు.

భార్య అతని వంక చూసి "మీరు మరీ లౌక్యం తెలియని వాళ్ళవుతున్నారు. నూటయాభై రూపాయలు అంటే చేదా?" అని అడిగింది.

"పరాయి సొమ్ము చేదు మాత్రమే కాదు. విషంతో సమానం కూడా" అన్నాడు లిక్కర్ తీసుకున్న సేతుమాధవన్.

"ఎంత మాత్రం కాదు. మహాలక్ష్మి మన దగ్గరికి నడిచి వస్తుంటే తలుపులు మూసుక్కూచుంటామా? ఆ డబ్బుతో మనం ఓ పరుపు కొనుక్కుందాం...అత్తగారికి దగ్గు మందు... పిల్లలకు పెన్సిల్ బాక్సులు కూడా కొనుక్కోవచ్చు" అంది మొగుడికి నచ్చచెబుతున్నట్టు పరిమళ.

ఆ రాత్రంతా సేతుమాధవన్ ఏడుస్తూనే వున్నాడు. తన బాధ తన తల్లికి చెప్పుకుంటే... అవును... తల్లికదా... తనని మందలిస్తుంది. చిన్నప్పుడు తన స్నేహితుడి పెన్సిల్ దొంగతనం చేసానని తనని కొట్టింది కూడా!

> **ఈ ప్రపంచంలో వృత్తిపరమైన తెలివితేటలు వున్నవాళ్ళు... బ్రతికే తెలివితేటలు వున్నవాళ్ళు అనే రెండు కేటగిరీలువుంటాయని అతని థియరీ. వృత్తిపరమైన తెలివితేటలు వున్నవాళ్ళు ఆర్థికంగా రాణించలేరు. మహా అయితే, మంచి నైపుణ్యం వున్న వ్యక్తి అని అనిపించుకోగలడు.**

** ** **

ఇది జరిగిన మూడవరోజు మరో రెండు వందలు వచ్చాయి. అతను వూహించని డబ్బు... తన జీతానికి సరిసమానంగా... ఆరోజు ఆ డబ్బు తీసుకుంటున్నప్పుడు అతని చేతులు పెద్దగా వణకలేదు. అతనిలో అపరాధ భావం కూడా పెద్దగా లేదు.

ఆ రోజు ఆ డబ్బు తీసుకొని యింటికి వెళ్ళేక, ఆ డబ్బును భార్య చేతికి యివ్వకుండా తల్లి దగ్గరకు తీసుకువెళ్ళాడు.

** ** **

"అమ్మా... నేను తప్పుచేసాను కదూ... నాలో అపరాధ భావం పెరిగిపోతోంది" చెప్పాడు తల్లి ఒడిలో తలపెట్టి.

తల్లి ఓసారి ఖళ్ళుఖళ్ళున దగ్గి "ఒరే సేతూ... ఈ వయసులో నీకు నేనేం చెప్పగలనురా... ఒక్కటిమాత్రం నాకు సంతోషంగా వుంది. ఇదివరకులా కాకుండా నాకు వెంటవెంటనే దగ్గు మందు తెస్తున్నావు. ఇప్పుడు నాకు సుఖంగా వుంది"

సేతు మాధవన్ లేచాడు. తల్లి తనను మందలిస్తుందని అనుకున్నాడు. లేదా తనను ఓదారుస్తుంది అనుకున్నాడు. ఏదీ చేయకుండా తనకు దగ్గుమందు తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు చెబుతుంది అంటే తను అవినీతి మార్గంలో వెళ్లినందున మంచిపని జరిగిందని చెబుతోందా?

** ** **

రోజులు... నెలలు... సంవత్సరాలు గడుస్తూనే వున్నాయి.

ఇప్పుడు లంచం తీసుకునే సమయంలో సేతుమాధవన్ చేతులు వణకడం లేదు అతనిప్పుడు తరుచూ ఈ బాధతో లిక్కర్ తాగడంలేదు. భార్యతో తన బాధ చెప్పుకోవడమూ లేదు.

అయితే అతనిలో సంఘర్షణ మాత్రం జరుగుతూనే వుంది. ఈమధ్య మరో సమస్య అతడ్ని వెంబడిస్తూవుంది. అతని ఆఫీసుకు, అతని పేరుతో



ఓ ఉత్తరం వచ్చింది. అందులో తన గురించే, తనను వుద్దేశించే రాసి వుంది.

సేతుమాధవన్‌గారికి...

మీ అవినీతి భాగోతం నాకు తెలుసు... మర్యాదగా మీ మార్గం మార్చుకుంటే మంచిది. లేనిపక్షంలో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళాల్సి వుంటుంది.

ఇట్లు ఆకాశరామన్న
(మీ శ్రేయోభిలాషి)

** ** **

ఆ వుత్తరం చూసినప్పట్నించీ మరింత సంఘర్షణకు గురయ్యేడు సేతుమాధవన్. ఏదో ఓరోజు ఈ విషయం ఆఫీసరుకు తెలుస్తుంది. తనని ఉద్యోగంలో నుంచి తీసివేస్తాడు. అయినా అదికాదు తన బాధ... తన పరువుపోతుంది. తనో అవినీతిపరుడు అని, లంచగొండి అని అందరికీ తెలుస్తుంది.

ఆ వూహే భరించలేకపోతున్నాడు సేతుమాధవన్. వెంటనే ఓ నిర్ణయానికి వచ్చాడు.

తనకు వచ్చిన బెదిరింపు వుత్తరం ఆఫీసర్ దగ్గరికి తీసుకువెళ్ళాడు. ఆ వుత్తరం ఆఫీసర్‌కు అందజేసాడు. అది చూసి ఆఫీసర్ యిదంతా నిజమేనా? అని నిలదీస్తాడు. అప్పుడు తను 'నిజమేనని' నిజాయితీగా చెబుతాడు.

వెంటనే తనని డిస్మిస్ చేయడమో, సస్పెండ్ చేయడమో చేస్తాడు. అయినా పర్లేదు. ఈ టెన్షన్ తను భరించలేడు.

నాలోని చచ్చిన నిజాయితీని చూస్తూ వుండలేకపోయాను. చనిపోయిన మనిషి శవం రెండ్రోజులు దాటితే కుళ్ళు కొడుతుంది. భరించలేని దుర్వాసన మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అలానే చచ్చిన నిజాయితీని, ముప్పయ్యేళ్ళు ఈ శరీరంలో వుంచేసాను. దాని తాలూకు దుర్గంధాన్ని భరిస్తూ... భరిస్తూ చివరి క్షణాల్లో ఓ నిర్ణయానికి వచ్చాను.

** ** **

ఆఫీసర్ ఆ వుత్తరం పరిశీలనగా చూసాడు. తర్వాత సేతుమాధవన్ వైపుచూసి...

"నీకు శత్రువులు ఎవరైనా వున్నారా?" అని అడిగాడు.

"లేరు సార్" సిన్సియర్‌గా చెప్పాడు సేతుమాధవన్.

"ఇది నక్సలైట్లు రాసారన్న అనుమానం ఏమైనా వుందా? అలాంటిదేమైనా వుంటే చెప్పు"

"లేదు సార్... అసలా అనుమానమే లేదు. వాళ్ళయితే నిజాయితీగా వుత్తరం కింద సంతకం పెడతారు"

"పోనీ ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని నీ అనుమానమా?"

"లేదు సార్. బ్లాక్‌మెయిల్ చేసేవాళ్ళయితే డబ్బు అడిగేవాళ్ళు. నిజాయితీగా నడుచుకోమని నాకు సలహా యివ్వరు కదా"

వెంటనే ఫెళ్ళున నవ్వాడు ఆఫీసర్.

"అయితే యింకా ఎందుకయ్యా భయం. యిలాంటి వుత్తరాలను మనం లెక్కచేయకూడదు. డబ్బు... డబ్బు ముఖ్యమయ్యా... మనలో మాట యిలాంటి విషయాల్లో కొద్దిగా జాగ్రత్తగా వుండాలయ్యా... ఆ చేత్తో తీసుకునే లంచం, ఈ చేతికి తెలియకూడదు. నేను చూడు... వెళ్ళెళ్ళు" అంటూ సాగనంపాడు.

** ** **

సేతుమాధవన్ బుర్ర తిరిగిపోయింది.

ఇన్నాళ్ళు తాము మాత్రమే అవినీతిపరులమని ఆఫీసర్‌కు ఏ పాపమూ తెలియదని అనుకున్నాడు. కానీ యిప్పుడు... తలా పాపం... తలా పిడికెడు.

** ** **

సేతుమాధవన్ మెల్లమెల్లగా సర్దుకోసాగాడు. జీవితం రొటీన్‌గా గడుస్తూనే వుంది. అవినీతి అనే వూబిలో నుంచి మాత్రం బయటపడలేకపోతున్నాడు. రోజులు గడుస్తున్నాయి. ఖర్చులు పెరుగుతున్నాయి. అన్నింటికన్నా ముఖ్యంగా అతనికో విషయం తెలిసింది.

అవినీతికి కూడా ఓ బలహీనత అని... ఆ బలహీనత వూబికన్నా ప్రమాదకరమైనదని తనా వూబిలో నుంచి బయటపడలేనని.

ఒక్కసారి లగ్జరీస్‌కు అలవాటు పడి సాయంత్రాలు మందుపార్టీలు, నైట్ డిస్కోలు. ఈ వయసులో అతనికి అలవాటయ్యాయి. అయినా సంఘర్షణే.

అతనికి మాత్రం బెదిరింపు వుత్తరాలు వస్తూనే వున్నాయి. అప్పుడప్పుడు వాళ్ళ ఆఫీసర్‌కు వుత్తరాలు వస్తున్నాయి. ఆఫీసర్ నవ్వేసి చెత్తబుట్టలో వేస్తున్నాడు. సేతుమాధవన్ మాత్రం నిర్లిప్తంగా వున్నాడు.

** ** **

ముప్పయ్యేళ్ళు గడిచాయి.

ఈ ముప్పయ్యేళ్ళలో సేతుమాధవన్ అవినీతి అనే మత్తు పదార్థానికి అలవాటు పడిపోయాడు. ఆ మత్తులో నుంచి బయటకు రాలేకపోయాడు. కానీ లంచం తీసుకునే ప్రతిసారి ప్రతీ రాత్రి అతను క్షోభను అనుభవిస్తూనే వున్నాడు.

ఈ ముప్పయ్యేళ్ళలో ఆర్థికంగా ఎంతో ఎదిగినా, నిజాయితీపరంగా తను కృశించినట్టే ఫీలయ్యాడు. తెల్లవారితే రిటైర్మెంట్. సరిగ్గా తెల్లవారాక తన చివరి సంతకం... పదివేలకు అమ్మేసాడు, ఓ ఫైల్ కదిలించడం ద్వారా.

అదే సమయంలో ఏసిబి వాళ్ళు దాడిచేసారు. సేతుమాధవన్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అతన్తోపాటు ప్యూను, సెక్షన్ ఆఫీసర్, ఆఫీసర్ కూడా! ఎవరో అజ్ఞాతవ్యక్తి ఫాక్స్ ద్వారా సమాచారం అందించి, వాళ్ళని రెడ్ హ్యాండెడ్‌గా పట్టించాడు.

** ** **

ప్యూన్, సెక్షన్ ఆఫీసర్, ఆఫీసర్, సేతుమాధవన్ ఒకే సెల్‌లో వున్నారు. సేతుమాధవన్ మాత్రం చాలా ప్రశాంతంగా వున్నాడు. సరిగ్గా ముప్పయ్యేళ్ళ క్రితం, నిజాయితీ నిబద్ధతతో ఆఫీసులో జాయిన్ అయినప్పుడు వున్న ప్రశాంతత వుంది.

మిగతా అందరూ టెన్షన్‌గా వున్నారు.

"ఇది... యిదెలా జరిగింది?" ఆఫీసర్ తనలో తనే గొణుక్కున్నాడు.

"నా వల్లనే" చాలా తాపీగా, ప్రశాంతంగా చెప్పాడు సేతుమాధవన్.

అందరూ దిగ్భ్రాంతిగా అతనివైపు చూసారు.

"అవును... నావల్లనే యిదంతా జరిగింది. అవినీతి వూబిలో నుంచి నేను బయటపడే ప్రయత్నం చేసాను. ఒకటికాదు రెండుకాదు... ముప్పయ్యేళ్ళ మానసిక క్షోభ అనుభవించాను. చనిపోయిన శవాన్ని యింట్లో వుంచుకొని, రోజూ ఏడ్చినట్లు, నాలోని చచ్చిపోయిన నిజాయితీని రోజూ గుర్తు చేసుకుంటూ ఏడ్చాను. చాలా ఆలస్యంగా నాకో నిజం తెలిసింది. లంచం అనేది మత్తుమందు లాంటిది. డ్రగ్స్‌కు అలవాటుపడ్డ వాళ్ళు ఎలా ఆ మత్తు నుంచి బయటపడలేరో... అక్రమ సంపాదన అనే మత్తులో కూరుకుపోయిన నాకు తెలిసింది.

నా అక్రమ సంపాదన మత్తు నన్నేకాదు... నన్నేకాదు... ఓ కారణంగా నా భార్యను, మరో కారణంగా నా తల్లిని ప్రభావితం చేసింది. ఈ మత్తులో నుంచి బయటపడ్డం అసాధ్యం అని అర్థమైంది.

అందుకే... నాలోని చచ్చిన నిజాయితీని చూస్తూ వుండలేకపోయాను. చనిపోయిన మనిషి శవం రెండ్రోజులు దాటితే కుళ్ళు కొడుతుంది. భరించలేని దుర్వాసన మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అలానే చచ్చిన నిజాయితీని, ముప్పయ్యేళ్ళు ఈ శరీరంలో వుంచేసాను. దాని తాలూకు దుర్గంధాన్ని భరిస్తూ... భరిస్తూ చివరి క్షణాల్లో ఓ నిర్ణయానికి వచ్చాను.

నన్ను నేను మార్చుకునే సాహసం చేయలేక వుత్తరాల ద్వారా నన్ను నేను హెచ్చరించుకున్నాను. మీకు కూడా హెచ్చరిక వుత్తరాలు రాసాను. అవి ఫలితాన్ని ఇవ్వలేదు. నాలోని చచ్చిన నిజాయితీ దుర్గంధం భరించలేను.

అందుకే, నా ముప్పయ్యేళ్ళ చచ్చిన నిజాయితీ సాక్షిగా, నేనే ఓ వ్యక్తిని ఏర్పాటుచేసి అతను మనకు లంచం యిచ్చేలా ఏర్పాటుచేసి, ఆ సమాచారం ఏసిబి వాళ్ళకు అందించాను. ఉద్యోగంలో చేరిన మొదటిరోజు నిజాయితీ నా వెంట వుంది. అందుకే ఈ ఉద్యోగపు చివరి రోజు నిజాయితీగా వుండాలని అనుకున్నాను. నన్ను క్షమించండి"

సెల్ వూచల మీద చేయివేసి చాలా ప్రశాంతంగా సంతృప్తిగా నిట్టూరుస్తూ చెప్పాడు.

ముప్పయ్యేళ్ళ తర్వాత అతనిలోని నిజాయితీ తాలూకు పరిమళం మెల్లమెల్లగా అతని శరీరాన్ని పరామర్శిస్తూ అవినీతి దుర్గంధాన్ని పారద్రోలుతుంది.